
# అనల కిరీటం

అపర్ణ



''ఆకాశవాణి కేంద్రం... బంగాళా ఖాతంలో వాయుగుండం ఏర్పడింది... ప్రాంతాల్లో రానున్న ఇరవై నాలుగ్గంటల్లో...''

స్టేషన్ మార్చాలనే ప్రయత్నం విరమించి, రేడియో కట్టేశాడు మాధవరావు — గుమ్మంలో అలికిడి గమనించి.

''కాలేజీ నుంచి రాగానే కనపడ మన్నారట.''

టెన్నిస్ ఆట దుస్తుల్లో కాఫీ ట్రేతో వచ్చింది అపర్ణ.

''అనుమతిస్తే ఒక ముఖ్య విషయం ప్రస్తావిద్దాం—కార్డ్షీట్ ఇస్తావేమోనని!'' వేళాకోళంగా పరామర్శించాడు కాఫీ అందుకుంటూ.

''మీదే ఆలస్యం, డాడీ!''

అలవాటైన తండ్రి ధోరణికి కళ్ళూ, ముక్కూ చిట్లించి గారాబంగా నవ్వింది.

''నీ పెళ్ళి విషయం!''

సగం తాగిన కాఫీ కప్పు అంచులమీంచి కళ్ళు తాటించాడు మాధవరావు.

''నాతో చెప్పదగింది...'' గోళ్ళు గిల్లుకుంటూ నసిగింది అపర్ణ.

''చాలా ఉంది. ఇప్పటి ఆడ పిల్లలకి చదువు, పెళ్ళి, ఉద్యోగం, అన్నిట్లోనూ తనవిగా ప్రకటించ దగిన అభిప్రాయాలున్నాయి. వారం రోజుల క్రితం తాతయ్య కబురు చేశాడు—మంచి సంబంధం ఉందని. మీ అమ్మ కూడా ఏడాదిగా పోరుతున్నది. చదువు మధ్యలో ఆపడం ఇష్టంలేక ఇంతదాకా వాయిదా వేస్తూ వచ్చాను. నీ అభిప్రాయం చెప్తే పిల్లను చూడ్డానికి రమ్మనమని తాతయ్యకు జాబు రాస్తాను.

తలొంచుకుని కాలి బొటనవేలు నేలన గీస్తూండి

27—10—82

పోయింది అపర్ణ.

''మౌనం అర్ధాంగీకార మంటారు!''

''డాడీ...''

తలెత్తి ఏదో చెప్పబోయి నిగ్రహించుకుంది.

''చెప్పమ్మా—ఇంకా చదువుకోవాలని ఉందా?''

''ఊహూ!''

''డాక్టర్, ఇంజినీర్, లెక్చరర్, బిజినెస్‌మన్, స్పోర్ట్స్‌మన్... అలా ఏమైనా అభిప్రాయాలున్నాయా?''

''అది కాదు, డాడీ...''

''ఎం. ఎ. చదువుతున్నావు. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఇచ్చి పెంచిన తల్లిదండ్రుల మధ్య పెరిగావు. నాన్చడం నాకు నచ్చదు.''

''చెప్పడానికి...'' సందేహంగా కనుపాపలు కదిలిస్తూ లోగొంతుకన తటపటాయించింది.

''మనిద్దరి మధ్య రాయబారం ఉంటుంది అమ్మని పిలవనా?!''

బెదురుగా నవ్వింది అపర్ణ.

''నేను...కాదు కాదు...నాకు...''

కూతురు వంక చూడకుండా వింటున్నాడు మాధవరావు.

''శ్యామకృష్ణ...తెలుసు గదా...అదే... నా బర్త్‌డే రోజు మనింటికి పిలిచాను...సన్నగా చామన చాయగా... మీతో జోక్స్ కట్ చేశాడు... అతను వెళ్ళిపోయాక మీరు చాలా మెచ్చుకున్నారు...''

అపర్ణ చెప్పడం పూర్తి కాలేదు.

''ప్రతి ఆడపిల్ల తండ్రీ ఇలాటి కథ ఒకటి వినడానికి సిద్ధపడక తప్పదా, అపర్ణా?!'' సారాంశాన్ని వడపోశాడు మాధవరావు.

''నా ఇష్టం ఇదీ అని చెప్పడం పొరబాటు కాదుగా డాడీ?'' ఆ కడుపున పుట్టిన అపర్ణకి ఆ మాటి దనం, సున్నితత్వం అరువు సొమ్ములు కావు.

''లేదమ్మా! పెద్దవాణ్ణి. అఫ్ కోర్స్, ఈ వయసుకుండే సెంటిమెంట్స్‌తో...ఇట్సాల్ రైట్!''

సంబాళించుకున్నాడు మాధవరావు, అరచేతిని ముక్కు కిందుగా రుద్దుకోవడం లాటిది చేస్తూ.

''మిమ్మల్ని నొప్పించానా, డాడీ?!''

తండ్రికి దగ్గరగా జరిగి కూర్చుంది అపర్ణ.

''ఆ ప్రశ్న అడగవలసిన అవసరం నాకు రాకుండా అదే...అతను... ఐ మీన్... యువర్ బిలవ్‌డ్ శ్యామకృష్ణ కుటుంబం వివరాలు, అవీ కావాలి...''

''థ్యాంక్యూ, డాడీ!''

సంబరంగా తండ్రి చేతుల్ని తన చేతుల్లోకి లాక్కుని కళ్ళ కద్దుకుని హాల్లోకి పరుగులాటి నడకన వెళ్ళిపోయింది అపర్ణ టెన్నిస్ రాకెట్ హుషారుగా ఊపుకుంటూ.

''ఇష్టం సవ్యమైంది కానప్పుడే అపర్ణ తండ్రికైనా, మరో ఆడపిల్ల తండ్రికైనా ఆ సంబరంతో క్షణకాలమే సంబంధం!''

ఆ తర్వాత, సంగతి ప్రస్తావిస్తూ ముక్తాయింపుగా అన్నాడు పడకమీద వాలేవేళ భార్య అనసూయతో మాధవరావు.

● ● ● ●

''మా నాన్నగారు...''

చక్రాల కుర్చీలో వాలి దినపత్రిక చదువుతూన్న

బవిరి గెడ్డం వ్యక్తికేసి భ్రుకుటి ముడిచాడు మాధవరావు.

"అపర్ణ నాన్నగారు."

పరిచయంగా పలికాడు శ్యామకృష్ణ తండ్రికేసి, మాధవరావును సోఫాలో కూర్చుండ జేస్తూ.

"రామ్మూర్తి!"

లోపల స్మరించ వలసిన సంవత్సరాల నాటి చేదు జ్ఞాపకం పెదిమల మీది కొచ్చింది అప్రయత్నంగా.

"ముందే ఎరుగుదురా?"

"చాలా బాగా!"

మాధవరావు కేసి పాలోచనగా తల వూచిన తండ్రిని గమనించాడు శ్యామకృష్ణ.

శ్రోతగా మిగిలాడు, ఆ తర్వాత వారి నడుమ—

"బావున్నారా?"

"చూస్తున్నారుగా!"

"ఎన్నాళ్ళయింది ఈ పక్కకొచ్చి?"

"అవుతుంది నాలుగేళ్ళు."

"దమయంతి.."

కళ్ళద్దాలు తీసి ముఖానికి చేతులు అడ్డం పెట్టుకున్నాడు రామ్మూర్తి.

"మా అమ్మగారి సంగతి యెత్తితే ఆయన చాలా ఫెయింట్ ఐపోతారు." తండ్రి హైరాణ సర్దుతూ అన్నాడు శ్యామకృష్ణ.

"ఓ.. ఐయామ్ సారీ!"

అసౌకర్యంగా సోఫాపై వెనక్కి చేరగిలిన మాధవరావు కళ్ళల్లో— ఎదురుగా తెల్లటిగోడన లైఫ్ సైజులో జనన—మరణ తేదీల చేవ్రాళ్ళతో దమయంతి ఛాయా చిత్రం.

"నేను వీధి బళ్ళో చదూకునే రోజుల్లో పోయింది." మాధవరావుని గమనించిన శ్యామ కృష్ణ కంఠం రుద్ధమయింది.

తనెందు కొచ్చాడు? తన కెదురైందేమిటి? ఏం మాట్లాడాలి? ఎందుకు మాట్లాడ్డం? ఎంత దారుణమైన పతాక సన్నివేశం పొంచి ఉంది తన జీవితంలో?

నిన్న రాత్రి నాలుగు చెరగులా పసుపు అంటించి సన్నాయి మేళం మధ్య ఖరారు చేసుకోవాలనుకున్న ఆశ—ఇవాళ ఇలా నల్లగా తెల్లారగలదని వూహించ లేక పోయాడు మాధవరావు.

మనసు అమావాశ్య సముద్రమై ఘోషిల్లింది.

"మేమిద్దరం కొంచెం ప్రత్యేకంగా మాట్లాడు కోవాల్సి ఉంది..."

ట్రే లోంచి ఆరంజి జ్యూస్ గ్లాసులు తెచ్చి టీపాయిపై ఉంచిన కొడుకు కేసి చూసి చెప్పాడు రామ్మూర్తి.

"అపర్ణ, శ్యామకృష్ణల ఆశలు నాకు తెలుసు!"

"తెలిసే ప్రోత్సహించారా?!"

వెంటనే మాట్లాడలేక పోయాడు రామ్మూర్తి మాధవరావు ధాటికి.

"అనుకోకుండా మనం ఇలా కలుసుకోడం..."

"పెద్ద దౌర్భాగ్యం!"

"మీ మనసు గాయపడటం సహజం. నా మీద కోపతాపాల్ని మన బిడ్డల జీవితాలమీద చూపిం చడం న్యాయం కాదు, మాధవరావుగారూ!"

"మీలా అందరూ గరళాన్ని అవలీలగా మింగ లేరు మరి!"

"వాళ్ళ చేరిక దోషంగానే భావిస్తున్నారా మీరు?"

"సిగ్గు కలగడం లేదా, రామ్మూర్తిగారూ? జీవితంలో మనం ఒకరి కొకరం ఎలాటి ప్రత్యర్థులమో... ఛీ.. ఛీ!.."

ఆపుకోలేని అసహ్యాన్ని ముఖంలో కుమ్మరిస్తూ అసహనంగా సోఫాలోంచి లేచాడు మాధవరావు.

"నిదానంగా ఆలోచిస్తే మీ రామాట అనలేరు. దయచేసి అపర్ణ నేమీ అనకండి." వేడికోలుగా చూశాడు రామ్మూర్తి.

"నేను దాన్ని కన్న తండ్రిని. మమకారం చూపడం, మందలించడం నాకు మాత్రమే సొంతమయిన హక్కులు."

"ఆవేశం పరిష్కారం కాదు. నేనూ మనిషినే. అనర్థాలకి, అసంగతాలకి ఒడిగట్టలేను. జీవితాన్ని విశాలంగా ఆలోచించి..."




రామ్మూర్తి మాట పూర్తి కాలేదు.

"మీ అభ్యుదయం, మేధస్సు, హేతువాదం, గతితార్కిక సిద్ధాంతం, నాస్తికత్వ రాద్ధాంతం నా జీవితంలో పోసిన నిప్పులు ఆర్పుకోవడానికే నాకు చాలా కాలం బట్టింది!" మాధవరావు ముఖం జేవురించింది.

"ఆ సమాధిని తవ్వడం వల్ల యెవరికీ ఉపయోగం లేదు. నా దోషాలు నాతోనే పోతాయి. నడక పోయినవాణ్ణి. కూర్చునే అర్థిస్తున్నాను. మీ కోసం ఈ తలుపులు తెరిచే ఉంటాయి!"

"మీ కాశ్రమ అక్కర్లేదు!"

విసురుగా అడుగులేస్తూ చరచరా బైటికి వెళ్ళి పోయాడు మాధవరావు.

అంటీ ముట్టని గాజు గ్లాసుల్లోని నారింజ రసం టీపాయి మీద అలాగే ఉండి పోయింది.

● ● ● ●

"అతన్ని మరిచిపోగలవా అపర్ణా?...ఆ మాట కొస్తే అది అనివార్యం...ఉత్తమం."

ఎలా ప్రారంభించాలో చాలా సేపు అంతుపట్టక, ఏవో తేల్చుకున్నట్లు నోరు విప్పాడు మాధవరావు.

"డాడీ!..." అయోమయంగా చూసింది అపర్ణ.

"తప్పదమ్మా! నీ ఇష్టాన్ని శాసించవలసిన కాఠిన్యమే నీ డాడీకి అత్యవసరమవుతోంది!"

"ఏమైనా అగౌరవం..."

"మర్యాదస్తులు."

"శ్యామకృష్ణ ప్రవర్తన..."

"అన్నమంతా పట్టి చూడక్కర్లేదు."

"కట్న కానుకలు ఆశకు మించి..."

"గుమ్మంలోనే బెడిసి కొట్టింది, అపర్ణా!"

మాట్లాడలేదు అపర్ణ.

"బాధగా ఉందా?"

"కారణం స్పష్టంకాని విముఖతని వూహించలేక పోతున్నాను."

నుదురు చిట్లించింది, అస్తవ్యస్తమవుతూ—

"ఒక్క ప్రశ్నకు జవాబు చెబుతావా, అపర్ణా?!"

తలెత్తి చూసింది తండ్రి వైఖరిని పోల్చుకో డానికి తంటాలు పడుతూ.

"శ్యామకృష్ణలో ఏం చూసి వేదన పడేంతగా ఇష్టపడుతున్నావు?"

"తెలివిగలవాడు. మానసికంగా చాలా ముందుకు ఆలోచించి జీవితాన్ని గడపాలనే తత్వం కలవాడు. స్నేహశీలతకి, సహృదయతకి లోటు రానివ్వనివాడు. బతుకు భాగస్వామ్యంలో స్త్రీ శక్తిని గౌరవించే సంస్కారం గలవాడు." తడుముకోలేదు అపర్ణ.

"నీ ఇష్టం పేరు శ్యామకృష్ణ కాకుండా ఉంటే ఎంత బాగుండేదమ్మా!" భారంగా నిట్టూర్చాడు మాధవరావు.

"పరిత్యాగగల మహోకుద్రాణ్ణి చూడమంటావా?" తిరిగి తనే పలికాడు అపర్ణ కళ్ళల్లోకి చూస్తూ.

"ప్రాణంతో మసిలే జీవితాలకి ప్రత్యామ్నాయాలు నప్పుతాయా, డాడీ?"

"కూడనప్పుడు, తగని సంగతి అయినప్పుడు ఆ తలుపులు మూసేయక తప్పదు!"

తన్ని కని పెంచిన పితృ హృదయం. తన అభిరుచుల్ని గౌరవించి మన్నించే శ్రేయోభిలాషి. తన ప్రవర్తనని కన్నెర్రచేసి శాసించే మార్గదర్శకుడు. ఒక స్వతంత్ర వ్యక్తి లాగా తనకు పలుకాడ్డం నేర్పిన స్నేహితుడు. మమతని, ఆప్యాయతని పంచి ఇచ్చే ఉత్తముడు.

మరోలా మరోలా తండ్రి వైముఖ్యాన్ని శంకించడానికి మనసు చాల్లేదు అపర్ణకి.

''సగం సగం మవునమే మీ భాషయితే నా ఇష్టానికి వ్యతిరేకం కాలేను, డాడీ!''

''నాకు ఎదురు తిరగడమే నేర్చేనా అపర్ణా నీకు?!'

''డాడీ!...''

''నీ కంటే ముందు పుట్టినవాణ్ణి. నీ పుట్టుక చూసిన వాణ్ణి. నీ జీవితంలో అనర్థాన్ని వెదికి పట్టుకున్నవాణ్ణి. విశ్వసించలేవా?''

ఆ కళ్ళల్లో కళ్ళుంచ వీలుకాని నైశిత్యం.

''ఒక జీవితాన్ని శాసించే ముందు...''

''సంజాయిషీ కావాలా, అపర్ణా?''

''మీరలా కోపం చేస్తే...నా మాటకి, నా మనసుకి మీరు నేర్పిన వివేకం వృథా అయిపోతుంది.''

''చెప్పి తీరా లంటావా?''

పెదిమలు బిగించి రెప్పల మధ్య కనుపాపల్ని నిశితంచేసి అన్నాడు మాధవరావు.

''మీ కంటిముందు పుట్టి పెరిగినదాన్ని. మిమ్మల్ని నిలదియ్యాలేను, డాడీ!''

''తట్టుకోగలవా?''

''నీకు అపర్ణ అని పేరెందుకు పెట్టానో తెలుసా, పాపా! ఆకూ అలం కూడా తినడం మానేసి ఈశ్వరుడి కోసం తపోముద్ర వహించిన పార్వతి సంకల్ప బలం, ఎదురు నిలిచే తెగువా నీకు అబ్బాలని—అని హైస్కూల్లో చదివాకునే రోజుల్లో మీరు నన్ను ఒళ్ళో కూచోబెట్టుకుని చెప్పిన మాటలు నే నెప్పుడూ మరవలేను, డాడీ!''

''అపర్ణా!''


కూతుర్ని దగ్గరగా తీసుకుని నుదుటిని చుంబించేడు—బాధా, ఆనందం కలగలుపైన ఉద్వేగాన.

''మీ అమ్మను పెళ్ళి చేసుకోకముందు నేను ఒకసారి వివాహితుణ్ణి. పెళ్ళయి ఏడాది గడవకుండానే చేస్తోన్న ఉద్యోగం పోవడంతో మిలట్రీలో చేరిపోయాను. మూడేళ్ళ తర్వాత ఆ వాతావరణం సరిపడక పారిపోయి మద్రాస్ వచ్చాను. ఇప్పటికైనా నన్ను విచారించే అధికారం ప్రభుత్వాని కుంది. పెళ్ళి అయిన కొత్తలోనే ఆమె కథలు వ్రాయడం రేడియో కార్యక్రమాల్లో పాల్గొనడం వంటివి చేస్తుండేది. నాకెంతో గర్వంగా ఉండేది, తన తెలివితేటలు చూస్తుంటే. ప్రోత్సహించాను. ఎకరం పొలం అమ్మి తన వ్రాసిన కథలు, గేయాలు, వ్యాసాలు సొంతంగా పుస్తకాలుగా అచ్చు వేశాను. మూడేళ్ళ తర్వాత తిరిగొచ్చిన నాకు నా గర్వం, నా ప్రోత్సాహాలు నా తలరాతనే మార్చేశాయి. పొంగిపోయేలా చేసిన ఆ తెలివితేటలు నా జీవితానికి నిప్పంటించాయి. గతి తార్కిక సిద్ధాంతాలని, నాస్తికత్వమని, తిరుగుబాటు కవనాలని హేతువాదమని, లైంగిక స్వేచ్ఛనీ—ఆమె భావాలు వ్రాతలు అన్నిట్లో నాకు కంపరం కలిగించే తీవ్ర పరిణామా లొచ్చాయి. మందలించి చిన్నబోయాను. నాకు అందని వ్యక్తిత్వం అయిపోయింది. బంధువుల ఎత్తిపొడుపులు, స్నేహితుల వేళాకోళాలు తట్టుకోలేకపోయాను. ఐదేళ్ళ దాంపత్యంలో ''అమ్మా, నాన్నా'' అని కట్టి పడేసే పిలుపుకి నోచుకోలేక పోయ్యాం. ఒక ట్యుటోరియల్ కాలేజి ప్రిన్సిపాల్ తో తనకి సంబంధం ఏర్పడిందని తెలిసింది. నిలవేశాను. తప్పనిపిస్తే తప్పుకోమంది. విడాకులు, ప్లీడర్ నోటీసులు భరణాలు ఇవేవీ లేకుండానే ఎవరి దారిన వాళ్ళం చీలిపోయ్యాం.''

బట్టి పట్టిన పాఠంలా గుక్క తిప్పుకోకుండా చెప్పడం ఆపి, కళ్ళు మూసుకున్నాడు మాధవరావు కూతురి వంక చూడ మనస్కరించక.

''ఈ కథతో నీ జీవితానికి సంబంధం ఏమిటని కదూ ఆలోచిస్తున్నావ్?'' కళ్ళు తెరవకుండానే తిరిగి తనే అన్నాడు మాధవరావు అపర్ణ మవునం గమనించి.

''ఆ అపశ్రుతి పేరు దమయంతి. ఆ పరిణామం పేరు రామ్మూర్తి. వాళ్ళబ్బాయి పేరు శ్యామకృష్ణ'' కళ్ళు తెరిచాడు మాధవరావు.




మెరుపు కొట్టినట్లు ఒక్కక్షణం కళ్ళు వెడల్పు చేసింది అపర్ణ తండ్రి కేసి.

చాలాక్షణాలు, పట్టు విడుపులేని నిశ్శబ్దానికేసి తల బాదు కున్నాయి.

''డాడీ!'' అపర్ణ పిలిచింది.

''ఇంకా నీకు మాటలున్నాయా, తల్లీ!''

ఆశ్చర్యాన్ని కళ్ళన పులుముకుంటూ కూతురి దెస తల పంకించాడు మాధవరావు.

''ఆడపిల్లని ఇలా మాట్లాడ వచ్చో కూడదో నాకు తెలీదు. నా ఆలోచన చెప్పడం న్యాయ మను కుంటున్నాను.''

చెవులు రిక్కించి చూశాడు మాధవరావు.

''మేమిద్దరం ఒక తల్లిదండ్రుల బిడ్డలం కాము. ఒక గోత్రీకులం కాము. మా ఇద్దరిదీ ఒక రక్తం కాదు. వేరు వేరు వంశాల వాళ్ళం. మా వావి వరుసలు ఆక్షేపణలేనివి. అందుకే ఆశ్చర్యం తప్ప కించ కలగడంలేదు నాకు.''

''అపర్ణా!''

''అతణ్ణి ఆమెనీ మన్నించి మీ మనసులోంచి తుడిచి వేయగలిగితే, మమ్మల్ని ఆశీర్వదించండి, డాడీ!''

''నువ్వు చెప్పిన యదార్థం నాకు తెలుసు. సమర్థించగలను. కానీ సమాజం—తేలిగ్గా తీసివెయ్యడం వీలు కాదు. అసలు నువ్వు చాలా గొప్పగా అను కునే శ్యామకృష్ణ నిలబడగలడా? జీవితకాలమంతా తల్లిదండ్రులు నీకు తోడు రాలేరమ్మా. పెళ్ళంటే నూరేళ్ళ పంట. మన దుడుకుతనాలకు అతి తెలివి తేటలకు మన సంతానం బలికాకూడదమ్మా! ఒక తరం భవిష్యత్తుని ఇరకాటంలో పెట్టే హక్కు మనకు లేదు. ఒక బాధ్యతగల ఆడపిల్ల తండ్రిగా నీ వివేకాన్ని వెన్ను తట్టలేను. నీ శిరసున ఈ అనల కిరీటాన్ని దీవించలేను.''

''కాలం తెచ్చే మార్పుల మీద నాకు చాలా నమ్మకం ఉంది, డాడీ! సమాజ దృక్పథం యెల్లప్పుడూ ఒకేలా ఉండదు. తను ఇరుక్కున్న చట్రంలోంచి బైట పడ్డానికి అది అనుక్షణం బలమైన ప్రయత్నం చేస్తూనే ఉంటుంది. ఆ తరాని కా తరం సమస్యల్ని తట్టుకునే శక్తిని పుంజుకుంటుంది. మరో ఇరవై యేళ్ళ తర్వాత కూడా మనుషులకు ఇప్పటి సంకుచితత్వాల్ని చాదస్తాల్ని అంట గట్టడం నావల్ల కాదు.''

ఊపిరి కోసం ఒక్కక్షణం విరామం తీసుకుంది అపర్ణ.

''శ్యామకృష్ణ విషయం. దేన్నయినా సకారణంగా ఆలోచించి అమలు పరచగల అతను నిలబడ గలడనే నమ్ముతున్నాను. అతనిలో దేన్ని అయితే వల్లమాలిన ఇష్టంతో నేను ఆరాధిస్తున్నానో అది మాటకు తప్ప చేతకు ఉపయోగపడదో— గుడ్ బై! మా ఇష్టాలకి అర్థమే లేదు. వన్ వే ట్రాఫిక్ లో తలపడే వ్యామోహం నాకు లేదు. అందుకే బాధ లేదు! బరువు లేదు!''

మాధవరావు మాట్లాడలేదు. కూతురు మనసు మార్చే శక్తి తనకు లేదని ఆయనకు తెలుసు.

(బిందువులో సింధువు నిలపగల నా అభిమాన వ్రాయసకారుడు ఆచార్య ఆత్రేయ షష్ఠి పూర్తి కానుకగా. .) ★